నేటినుంచి 'గ్యారంటీలకు' దరఖాస్తులు

మరిపెడ: గురువారం నుంచి మున్సిపాలిటీ పరిధిలోని 15వార్డుల్లో ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపాడు. 28వ తేదీ గురువారం 1వ వార్డు దుబ్బతండాలో, 2వ వార్డు కస్నాతండాలో, 15వ వార్డు దక్నతండాలో, 6వ వార్డు ఆర్‌జేఆర్‌ఎం కళాశాలలో, 29వ తేదీ 3వ వార్డు ఆడిటోరియం, 5వ వార్డు లోక్యతండాలో, 4వ వార్డు ఎస్టీ కాలేజీ, 7వ వార్డు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో, 30వ తేదీ 8వ వార్డు కూన్యతండాలో, 10వ వార్డు మున్సిపల్ కార్యాలయంలో, 9వ వార్డు ఎస్సీ హాస్టల్ కార్గిల్‌సెంటర్‌లో, జనవరి 2న 12వ వార్డు శివాలయం గుడి ఆవరణలో, 14వ వార్డు సెంట్ అగస్టీయస్ స్కూల్‌లో, 13వ వార్డు మరిపెడ జూనియర్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

నర్సింహులపేట: ఎంపీడీఓ భారతీ గ్రామ సభల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 28న పెద్దనాగారం స్టేజీ, ముంగిమడుగు, వస్త్రాంతండా, బక్కతండా జీపీల్లో, 29న లోక్యాతండా, బాసుతండా, అజ్మీర తండా, నర్సింహపురం బంజర, 30న గోపాతండా, ఫకీరతండా, గోల్‌బోడ్కతండా, రామన్నగూడెం, జనవరి 2న పడమటిగూడెం, నర్సింహులపేట, రూప్లాతండా, కౌసల్యదేవిపల్లి, 3న వంతడపల, కొమ్ములవంచ, పెద్దనాగారం, జయపురం, 4న జగ్గుతండా, బొజ్జన్నపేట గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.

డోర్నకల్: మండలంలోని 26 గ్రామాలల్లో 11,445 కుటుంబాల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు 126 కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ చలపతిరావు తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డుల్లో 4,501 కుటుంబాలకు 45 కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు.



డోర్నకల్: ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షకు హాజరైన అధికారులు

పెద్దవంగర: స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా సహకార, మండల ప్రత్యేక అధికారి సయ్యద్ ఖుర్షీద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డిలతోపాటు మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

చిన్నగూడూరు: నేడు గుండంరాజుపల్లి, పగిడిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్యాంసుందర్, ఎంపీఓ యాకయ్య తెలిపారు. 29న మంగోళిగూడెం, మంగోరిగూడెం, 30న విస్సంపల్లి, తుమ్మలచెరువు తండా, జనవరి 2న జయ్యారం, మేఘ్యాతండా, 3న చిన్నగూడూరు, ఉగ్గంపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దంతాలపల్లి: నేటినుంచి గ్రామాలలో జరిగే గ్రామసభలకు దరఖాస్తులు తీసుకున్న వారి నుంచి రికార్డు తప్పనిసరిగా చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి నాగమణి బుధవారం తెలిపారు. మండలంలోని నేడు గ్రామసభ నిర్వహించే లక్ష్మీపురం గ్రామాన్ని సందర్శించారు. దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే పంపిణీ చేస్తుందన్నారు. గ్రామసభలు ఉదయం 7గంటలకే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్‌పాషా, కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా మండలంలోని ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలో గల వివిధ గ్రామాలలో ప్రజల సమస్యలపై గ్రామసభలు నిర్వహించనునట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీలక్ష్మి తెలిపారు. నేడు ఉదయం 8గంటల నుంచి లక్ష్మీపూరం, దొనకొండ, నిదానపురం, ఆగాపేట గ్రామాలలో నిర్వహించనునట్లు తెలిపారు.



దంతాలపల్లి: లక్ష్మీపురం గ్రామంలో జీపీ కార్యాలయం పరిశీలిస్తున్న అధికారులు

గూడూరు: మండలంలోని 39 గ్రామ పంచాయతీలలో గురువారం (నేటి) నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజాపాలన గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల పరిషత్ అధికారిణి శ్రీమతి రోజారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గార్ల: మండలంలో నేటి నుంచి ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్ తెలిపాడు. ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలపై దరఖాస్తు ఫారాలు పంచాయతీ కార్యదర్శులు పంపిణీ చేస్తారన్నారు. సమావేశంలో తహసీల్దార్ స్వాతిబిందు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఆరు గ్యారంటీల అమలుకు నేటినుంచి జనవరి 6వరకు గ్రామాలల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించే అంశాలపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించాడు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయం నుంచి మందుల శ్రీరాములు, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ శేశాద్రి, ఏఓ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ పార్థసారథి పాల్గొన్నారు.



పెద్దవంగర: సమీక్షలో పాల్గొన్న అధికారులు

కొత్తగూడ: ప్రజాపాలన గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు సూచించారు. ఈనెల 28 గురువారం గోవిందాపూర్, చెరువుముందుతండా, దుర్గారం, ఎదుళ్లపల్లి, 29న ఎంచగూడెం, గోపాలపురం, పెగడపల్లి, గుండం, 30న గుంజేడు, తాటివారివేంపల్లి, కార్లాయి, కోనాపూర్, జనవరి 2న కొత్తపల్లి, మొండ్రాయిగూడెం, రామన్నగూడెం, ముస్మి, 3న ఓటాయి, బత్తులపల్లి, పొగుళ్లపల్లి, కొత్తగూడ, 4న రేన్యతండా, సాదిరెడ్డిపల్లి, జంగవానిగూడెం, వేలుబెల్లి గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

తొర్రూరు: నేడు 1,2,3,4 వార్డుల్లో, 29న 5, 6, 7, 8 వార్డుల్లో, 30న 9, 10, 11, 12 వార్డుల్లో, 2న 13, 14 , 15, 16 వార్డుల్లో, జనవరి 1వ తేదీ మినహా జనవరి 6 వ తేదీల వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని మున్సిపల్ కమిషనర్ సరస్వతి సూచించారు.

నల్లబెల్లం స్వాధీనం

డోర్నకల్: మండలంలోని దారావత్‌తండా, మాన్యాతండా మార్గంలో నల్లబెల్లం, పటికను పట్టుకున్నట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. దారావత్‌తండా, మాన్యాతండా మార్గంలోని ఓ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన 15క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటికను ద్విచక్రవాహనాలతో ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తుండగా ఎస్సై ఝాన్సీ పట్టుకున్నట్లు తెలిపారు. సుమారు రూ.1.36లక్షల విలువైన నల్లబెల్లం, పటికతోపాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. బెల్లం విక్రయాలు చేస్తున్న మండలంలోని కస్నాతండాకు చెందిన వాంకుడోత్ మోహన్‌తోపాటు తరలింపునకు సహకరించిన కురవి మండలం నేరెడ శివారు మంచ్యాతండాకు చెందిన బట్టు కుమార్, గూడూరు మండలం దుబ్బగూడెంకు చెందిన దరంసోత్ రాజు, నూనావత్ పవన్‌ను అదుపులోకి తీసుకోగా అక్రమ తరలింపులో భాగస్వామిగా ఉన్న దుబ్బగూడెంకు చెందిన పొడుగు వంశీ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపాడు.

పేద విద్యార్థులకు చేయూత

తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు లయన్స్ సేవా తరుణి జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి జన్మదినాన్ని పురస్కరించుకొని స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేసి బుధవారం చేయూతనిచ్చారు.. ఈసందర్భంగా నాగవాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేదలు, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదవ్‌రెడ్డి, లయన్స్ తరుణి సంస్థ ప్రతినిధులు శారద, శైలజ, పినాకపాణి, శ్రీదేవిరెడ్డి, రాధిక, రమేష్, శ్రీధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో బుధవారం దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని యాదవ్ యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఓ డిప్యూటీ కలెక్టర్ తల్లి వాసం లింగమ్మ, ఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్‌లు స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీకటి ప్రవీన్, ఎంపీటీసీ సభ్యుడు కధిర జగన్, చిన్నాల కట్టయ్య, సూరబోయిన యాకయ్య, జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య, జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, గొల్లకురుమ సంఘం నాయకులు, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గార్ల ఎస్సైగా జీనత్‌కుమార్



గార్ల: గార్ల మండల ఎస్సైగా ఎన్.జీనత్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించాడు. మరిపెడ పోలీస్‌స్టేషన్ విధులు నిర్వహించిన జీనత్‌కుమార్ గార్ల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించాడు.

సీరోలు ఎస్సైగా విజయరామ్



కురవి: సీరోలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్సైగా విజయరామ్ బాధ్యతలను స్వీకరించాడు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన రమాదేవి జిల్లా కేంద్రంలోని హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు.

విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్ అందజేత



గార్ల: మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గార్లలోని బీఎస్ఎస్ చిల్డ్రన్ హోమ్ విద్యార్థులకు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి చేతుల మీదుగా బుధవారం స్కూల్‌బ్యాగ్స్, దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, బీఎస్ఎస్ ఫీల్డ్ మేనేజర్ బి సేనా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అశోక్, డేవిడ్, వీరన్న పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి



డోర్నకల్: త్వరలో జరగే పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించడంపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు యాప సీతయ్య తెలిపాడు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనపై ప్రజలు విశ్వాసంతో ఉన్నందున పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. సమావేశంలో నాయకులు నాగేశ్వర్‌రావు, దేవా, ఉపేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎమ్మెల్యే మురళీనాయక్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి బొకేను అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాయిని వీరేందర్ మాట్లాడుతూ.. మానుకోట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం, మౌలిక వసతులు సమకూర్చి విద్యాభివృద్ధికి సహకరించాలనివారు కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయిని వీరేందర్, అధ్యాపకులు మధు, నాగిరెడ్డి, షాహీద్, సురేందర్, సుధాకర్, రాజేందర్, ప్రేమ్ శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రస్థాయి క్రీడలకు మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం కే.వెంకటరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ధరావత్ మోహన్ నాయక్ బుధవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల జోనల్ స్థాయి క్రీడలు ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొమురం భీం మినీ స్టేడియంలో ఈనెల 20, 21, 22వ తేదీలలో జరిగాయన్నారు. క్రీడాకారులు జనవరి 4వ తేదీ నుంచి ఆరో తేదీ వరకు భద్రాచలంలో జరగనున్న రాష్ట్ర స్థాయి గిరిజన బాలబాలికల ఎంపిక క్రీడాోత్సవాల్లో పాల్గొంటారన్నారు. పదో తరగతి విద్యార్థుల అండర్-17 ఖోఖోలో జే.పాండు, బి.సింహాద్రి, ఎం.విఘ్నేష్, అండర్-17 ఖోఖోలో, అండర్-14 ఖోఖోలో ఎనిమిదో తరగతి విద్యార్థి కే.సంతోష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ మోహన్ నాయక్, పీఈటీ ఇస్మాయిల్‌ను హెచ్‌ఎం వెంకటరెడ్డి అభినందించాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిరాసింగ్, వెంకన్న, సదర్, కిషన్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఐటీడీఏ పీఓ అంకిత్, మహబూబాబాద్ డీటీడీఓ ఎర్రయ్య, ఏటీడీఓ సత్యవతి అభినందించారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలంగాణ అథ్లెటిక్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగిశెట్టి మనోజ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జాతీయ అంతర్ జిల్లాల జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్ బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్ జిల్లా కార్యదర్శి బాస నాగమణి మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరిలో గుజరాత్‌లో జరిగే 19వ జాతీయ అంతర్ జిల్లాలో అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని, ఎంపికైన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ అందజేస్తామని, మానుకోట జిల్లా నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అనిల్, పీఈటీలు సింధువర్మ, వీరన్న, దక్షినాయక్, స్వప్న, జ్యోతి, వెన్నల, నిర్మల, కృష్ణ, అశోక్, ధనజీ, తదితరులు పాల్గొన్నారు.



అందజేసిన సర్టిఫికెట్లతో విద్యార్థులు

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు



రథం లాగుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయ ప్రతిష్ఠ జరిగిన దినోత్సవం సందర్భంగా, శ్రీఅయ్యప్పస్వామి వారికి మండల పూజల్లో భాగంగా ముగింపును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఆలయంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గద్దె రవి, ప్రధాన కార్యదర్శి బవిరిశెట్టి నాగేశ్వరావు, ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ సంజీవ నంబూద్రి ఆధ్వర్యంలో ఆలయంలో ఈ పూజలు జరిగాయి. అయ్యప్పస్వామివారి ఉత్సవమూర్తిని ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. అయ్యప్పస్వామి నగరసంకీర్తన సందర్భంగా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ రథాన్ని లాగారు.

క్రైం కార్నర్..

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

గూడూరు: అనారోగ్యంతో మనస్థాపానికి గురైన ఓ మహిళ ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సీతానగరం శివారు రాళ్లవాగుదస్నతండాలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాదావత్ వీరమ్మ (49) భర్త బాల్య వేర్వేరుగా ఉంటున్నారు. ఆమె కుమారుడు రమేష్‌తో కల్సి ఉంటుంది. కొంతకాలంగా నడుము నొప్పి వస్తుండగా రెండు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకుంది. అయినా తిరిగి నడుమునొప్పి వస్తుండడంతో మనస్థాపానికి గురైన వీరమ్మ ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు గూడూరు ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

కురవి: రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని శివారు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం అయ్యగారిపల్లికి చెందిన మధు అనే వ్యక్తి బైక్‌పై కురవి నుంచి అయ్యగారిపల్లికి వెళ్తున్నాడు. వెనకాల సీరోలు మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన రాంబాబు అనే వ్యక్తి మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా చింతపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో రాంబాబు బైక్ అదుపుతప్పడంతో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. వెంటనే గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించారు.

కుక్క దాడిలో వ్యక్తికి..

చిన్నగూడూరు: మండలంలోని విస్సంపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీ కోల నర్సయ్యపై వీధికుక్క బుధవారం దాడి చేసి గాయపర్చింది. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన గొర్ల కాపరిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు స్థానికులు తెలుపుతున్నారు.

అభిషేక పీఠం సంప్రోక్షణ పూజలు

మహబుబాబాద్ రూరల్: పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో గోదారంగనాథులు, వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామికి నూతన విగ్రహాలకు, అభిషేక పీఠం సంప్రోక్షణ పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. గోదా ఉత్సవ కమిటీ, ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గోదా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు దాతలుగా వ్యవహరించి చందాలు ఇవ్వగా 90కిలోల గోదా రంగనాథుల ఉత్సవ మూర్తుల పంచలోహ విగ్రహాలను తయారు చేయించి ఆలయంలో ఏర్పాటు చేశారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి విగ్రహాలను జనా ఏజెన్సీస్ నిర్వాహకులు అర్వపల్లి రామకృష్ణ, పార్వతి, వీరయ్యగుప్తా, మాలతి బహూకరించారు.

న్యాయం చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

బయ్యారం: మండలంలోని అల్లిగూడెం గ్రామంలో అనేక సంవత్సరాల క్రితం నిర్మించుకున్న ఇళ్లు ప్రభుత్వ భూమిలో ఉన్నాయని రెవెన్యూ అధికారులు ఇటీవల ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వివాదాస్పదంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 80/1లో 6 ఎకరాల భూమి ఉండగా ఇందులో 4.20ఎకరాలలో నివాసగృహాలు ఉండగా మిగతా 1.20 ఎకరాలు వ్యవసాయ భూమిగా ఉంది. సర్వే నంబర్‌లోని మొత్తం భూమిపై గిరిజన, గిరిజనేతరుల మధ్య కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతుంది. దీంతో రెవెన్యూ అధికారులు వివాదాస్పద భూమిపై ఎల్‌టీఆర్ కేసు నమోదు చేసి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఈ భూమి వివాదం ప్రస్తుతం హైకోర్టులో కొనసాగుతున్న సమయంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయటంతో ఇక్కడ నివాసం ఉంటున్న వారిలో ఆందోళన వ్యక్తం అవుతుంది. తమ తాత ముత్తాతల నుంచి వంశపారపర్యంగా జీవిస్తుండగా ఇప్పుడు తాము ప్రభుత్వ స్థలంలో ఉన్నామని అధికారులు బోర్డు ఏర్పాటు చేయటం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై తమకు న్యాయం చేయాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తహసీల్దార్ ఇమ్మానుయల్ ఆందోళనకారులతో మాట్లాడుతూ.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

సంక్షిప్త సమాచారం

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బయ్యారం: రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత వరిధాన్యంకు మద్దతు ధర కంటే అధికంగా ధర రావడాన్ని హర్షిస్తూ బుధవారం బయ్యారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సందర్భంగా కిసాన్ ఖేత్ మజ్దూర్ మండల అధ్యక్షుడు టి.లింగయ్యయాదవ్, సర్పంచ్ కోటమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అవకాశం కల్పించాలి

డోర్నకల్: ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులందరికీ అవకాశం కల్పించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం బుధవారం కోరారు. రేషన్ కార్డు లేదనే సాకుతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పేదలను దూరం చేయవద్దన్నారు.

సన్మానం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుండెపుడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏకదాటిగా 13ఏళ్ల పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములై సేవలందించిన హెచ్‌ఎం కుడితి ఉపేందర్‌రెడ్డి పదోన్నతిపై మెదక్ జిల్లాకు బదిలీపై వెళ్లాడు. ఈసందర్భంగా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను శాలువాలతో బుధవారం ఘనంగా సన్మానించారు.

మండల కమిటీ ఎన్నిక

కురవి: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం మండల కన్వీనర్‌గా చిదురాల రామకృష్ణ, కోకన్వీనర్‌గా జంగిలి మహిపాల్ ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు వారికి నియామక పత్రాన్ని సంఘం జిల్లా కన్వీనర్ దొంతోజు ఓంకార్ అందజేశారు.

విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి

కేసముద్రం: విద్యుత్‌షాక్‌తో గొర్రె మృతి చెందిన సంఘటన మండలంలోని బిచ్యానాయక్‌తండా జీపీ శివారు రాజీవ్‌నగర్‌తండాలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన లకావత్ రెడ్యా గొర్లను మేతకు తీసుకువెళ్లి, తిరిగి వస్తుండగా రంగాపురం శివారులో గొర్రెల మందలోని, ఒక గొర్రెపోతు వ్యవసాయబావి వద్దకు వెళ్లగా, విద్యుత్ మోటార్ వద్ద ఫెయిల్ అయిన తీగ తాకడంతో విద్యుత్‌షాక్ గురై మృతిచెందింది.

ఆర్థికసాయం



గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో కాశీకి చెందిన బ్రాహ్మణుడు సతీష్‌పాండ్యే కూతురు శ్రీజ అనారోగ్యానికి గురైంది. విషయం తెల్సుకున్న కొంతమంది భక్తులు బుధవారం రూ. 51,016 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో హిందూమిత్ర ప్రతినిధులు పింగిళి శ్రీనివాస్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, కమటం సంతోష్, మహిపాల్, కట్టయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

గూడూరు: ఏజెన్సీ మండల కేంద్రమైన గూడూరులో ప్రజలకు అవసరమైన మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ(యూ) నాయకుడు పానుగంటి నర్సయ్య బుధవారం కోరారు. మండల కేంద్రంలో అధికారికంగా ఒకే మీ సేవా కేంద్రం ఉండగా, వారు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందించుటలో డబ్బులు కాజేస్తున్నారని ఆరోపించాడు.

మహా పడిపూజ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని శివాలయంలో బుధవారం అయ్యప్ప మాలధారుల మహా పడిపూజను నిర్వహించారు. గురుస్వామి దేవేందర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో గురుస్వాములు మొగులగాని యాదగిరి, గూడురు కనకం, కల్లెడ మదు, చౌడారపు విక్రమ్, గౌని విజయ్‌కుమార్, రమేష్, గణేష్, వెంకన్న, వీరన్న, దీక్షిత్, సికిందర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల హక్కులను పరిరక్షించాలి

తొర్రూరు: ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల హక్కుల పరిరక్షణ కోసం పాలకవర్గాలు పాటుపడాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం డిమాండ్ చేశారు. బుధవారం తొర్రూరు పట్టణంలో పెన్షనర్స్‌డే వక్షోత్సవాలను పురస్కరించుకొని రాజయ్య అధ్యక్షతన పెన్షర్ల సధన కర్త డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్ల లింగయ్య, కాలువ వీరయ్య, యూనిట్ గౌరవ అధ్యక్షుడు మార్కండేయ, ప్రధాన కార్యదర్శి వెంకటాచారీ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

కేసముద్రం: చదువుతోనే సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరికిపండ్ల అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ ఓస్లో నేషన్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ వారి మిషన్ విద్య విజ్ఞాన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మూడావత్ మోహన్ అందజేసిన బుక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.రాజు, ఫౌండేషన్ డైరెక్టర్లు నరేష్, దుర్గాపూర్, జయకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం డీసీఎస్ శర్మ బుధవారం తెలిపాడు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు ఏటూరునాగారంలో జరిగిన అండర్-17 విభాగం కబడ్డీ పోటీల్లో నందిని, అండర్-14 విభాగంలో నవ్య, అథ్లెటిక్స్‌లో స్వప్న, కల్యాణి, ఆర్చరీలో దివ్య, శ్రీవల్లి, ఖోఖోలో స్వప్న, వాలీబాల్‌లో ఇందు ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు తెలిపారు.

జీపీ నిధులపై విచారణ చేపట్టాలి



నెల్లికుదురు: గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ వార్డు సభ్యులతోపాటు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈసంఘటన మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వార్డు సభ్యులు మాధరి ప్రశాంత్, గుగులోతు రవి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం స్టేట్ ఫైనాన్స్ కమిషన్, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్, ఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.2.40కోట్ల నిధుల విడుదల అయినట్లు తెలిపారు. ఈ నిధుల్లోంచి రూ.50నుంచి రూ.60లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన సర్పంచ్, ఉపసర్పంచ్‌పై విచారణ జరిపి, తప్పుడు బిల్లులకు ఎంబీ రికార్డు చేసిన ఏఈపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.